క్లుప్తంగా

రచయిత కొప్పల ప్రసాద్‌కు సత్కారం


రచయిత ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): వైఎస్సార్ జిల్లాలోని కడపలోని ఐఎంఏ హాల్‌లో శనివారం నిర్వహించిన జిల్లా రచయితల మహాసభల్లో నంద్యాల రచయిత కొప్పుల ప్రసాద్‌ను నిర్వాహకులు సత్కరించారు. సాహితీ సంఘాల ప్రతినిధి, అంతర్జాతీయ శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ..రచయితల మహాసభల్లో వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం, రాయలసీమ భాగస్వామ్యం అనే అంశంపై మహాసభలు జరిగాయన్నారు. నంద్యాలకు చెందిన వర్ధమాన రచయిత కొప్పుల ప్రసాద్ పాల్గొని రాయలసీమలోని వర్షాభావ పరిస్థితులపై, సీమవాన సవ్వడి అనే శీర్షికతో కవితాగానం చేశారు. వైఎస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, కార్యదర్శి సుబ్రహ్మణ్యం ప్రసాద్‌ను సన్మానించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నంద్యాల(అర్బన్): ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో మృతి చెందిన మండలంలోని వెంకటేశ్వరపురం గ్రామానికి చెందిన నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు శనివారం వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు వెంకటేశ్వరరెడ్డి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. మృతుని భార్యకు బంధువులు ఎవరూ లేకపోవడం, ముగ్గురి సంతానంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న వెంకటేశ్వరరెడ్డి బాధిత కుటుంబానికి సాయం అందజేశారు.

తూడిచెర్ల సబ్‌చానల్‌కు 300 క్యూసెక్కుల నీరు


కేసీ కెనాల్‌లో ప్రవహిస్తున్న నీరు

పాములపాడు: మండలంలోని కేసీ కెనాల్ 120 వ కిలోమీటర్ లాకిన్స్‌లా నుంచి శనివారం 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుంకేశుల నుంచి 1,500 క్యూసెక్కుల నీరు కేసీ కెనాల్‌లోకి వస్తుందన్నారు. లాకిన్స్‌లా నుంచి అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, నిప్పుల వాగుకు నిలుపుదల చేశామని వివరించారు.

శ్రీశైలంలో నేడు స్వర్ణరథోత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం మహా క్షేత్రంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం 8.30 గంటలకు స్వర్ణ రథోత్సవం నిర్వహించనున్నట్లు దేవస్థాన ఈఓ ఎం. శ్రీనివాసరావు శనివారం తెలిపారు. వేకువ జామున స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజల అనంతరం ఆలయ మాడవీధులలో స్వర్ణ రథోత్సవం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి రథోత్సవంలో పాల్గొనాలన్నారు.

అడవుల సంరక్షణ.. అందరి బాధ్యత


కళాజాతతో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

బనగానపల్లె రూరల్: పర్యావరణాన్ని కాపాడడం, అడవులను సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుబ్బరాయుడు అన్నారు. మండలంలోని నందివర్గం, రామతీర్థం గ్రామాల్లో అడవుల సంరక్షణ, అగ్నిప్రమాదాల నుంచి రక్షణపై శనివారం కళాజాత నిర్వహించారు. జానపద కళాకారులు ప్రతాప్ బృందం గేయాల ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వన్యప్రాణులను ఎలా సంరక్షించుకోవాలి, అగ్నిప్రమాదాలను ఎలా నివారించాలి తదితర విషయాలను తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ విజయలక్ష్మి, ఎఫ్‌బీఓ వెంకట్‌రెడ్డి, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ కిక్ బాక్సింగ్ పోటీల్లో పతకాలు

కర్నూలు (టౌన్) : ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు ఢిల్లీ నగరంలో అంతర్జాతీయ వాకో ఇండియా కిక్స్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 4వ ఓపెన్ కిక్ బాక్సింగ్ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు పతకాలు సాధించారు. జిల్లాకు చెందిన గుర్రం జయకళ్యాణ్, ఉపేంద్ర, ఈశ్వర్ వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు కిక్ బాక్సింగ్ రాష్ట్ర కార్యదర్శి నరేంద్ర ఆచారి శనివారం తెలిపారు.

విద్యార్థుల్లో ఒత్తిడికి చెక్

- మారిన పది పరీక్షల విధానం
- ఆరు సబ్జెక్టులు... ఏడు పేపర్లుగా నిర్వహణ
- సైన్స్ సబ్జెక్టుకు మాత్రమే రెండు పేపర్లు
- వైఎస్సార్‌సీపీ సంస్కరణలతో విద్యార్థులకు ఊరట



గోస్పాడు మోడల్‌స్కూల్‌లో ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థులు

గోస్పాడు: పదో తరగతి పరీక్షలంటేనే విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంటుంది. రెండేళ్ల క్రితం వరకు ఆరు సబ్జెక్టులు 11 పేపర్లుగా పరీక్షలు నిర్వహించేవారు. అయితే రెండేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల మూలంగా వీరిలో ఆందోళన మాయమైంది. ప్రస్తుతం ఆరు సబ్జెక్టులు, ఏడు పేపర్లుగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది అదే విధానాన్ని అనుసరిస్తూ వారిలో ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం ప్రతి పరీక్షకు ఒక రోజు విరామం ఇస్తున్నారు. గతేడాది విద్యా సంవత్సరంలో మాదిరిగానే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఏడు పేపర్లుగా నిర్వహించనున్నారు. పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం పరీక్షల షెడ్యూలును విడుదల చేసింది. నియోజకవర్గంలోని 86 పాఠశాలలో 6,135 మంది పది విద్యార్థులు ఈఏడాది పరీక్షలకు హాజరు కానున్నారని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.

గతంలో పరీక్షలు ఇలా..

పదో తరగతి పరీక్షలు చాలా సంవత్సరాల పాటు 11 పేపర్లు నిర్వహించారు. హిందీ మినహా తెలుగు, ఇంగ్లిష్, గణితం, సోషల్ సబ్జెక్టుల్లో ప్రతి సబ్జెక్టుకు 50 మార్కులు చొప్పున రెండు పేపర్లు నిర్వహించేవారు. సైన్స్‌లో ఫిజిక్స్, బయాలజీ సబ్జెక్టులకు సంబంధించి 50 మార్కులు చొప్పున రెండు పేపర్లు ఉండేవి. ఒక్కో పరీక్షకు ఒక్కో రోజు చొప్పున 11 రోజులు నిర్వహించేవారు. కరోనా ప్రభావంతో 2019-20, 2020-21 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను రద్దు చేశారు.

ఈ ఏడాది పరీక్షలు ఇలా..



2022-23 విద్యా సంవత్సరంలో పది పరీక్షలను ఏడు పేపర్లకు కుదించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, సోషల్, సైన్స్, గణితం సబ్జెక్టుల్లో ఒక్కో సబ్జెక్టుకు వంద మార్కులు కేటాయించారు. సైన్స్ సబ్జెక్టులో మాత్రం ఫిజికల్, బయాలజీ సబ్జెక్టులకు సంబంధించి ఒకే ప్రశ్నపత్రాన్ని ఇచ్చారు. 2024-25 విద్యా సంవత్సరంలో నిర్వహించే పది పబ్లిక్ పరీక్షల్లో కూడా ఆరు సబ్జెక్టులకు ఏడు పరీక్షలుగా నిర్వహించనున్నారు.

11 పేపర్లు రాయాల్సివచ్చేది



పది పరీక్షల్లో విద్యార్థులు గతంలో 11 పేపర్లు రాశారు. పరీక్షలు ఉన్నన్ని రోజులు విద్యార్థులు ఒత్తిడికి గురయ్యేవారు. కరోనా తరువాత 11 నుంచి ఏడు పేపర్లకు కుదించారు. ఆరు సబ్జెక్టులకు గాను సైన్స్‌ను మాత్రం రెండు పేపర్లుగా, మిగిలిన వాటికి ఒక్కొక్క పేపరుగా పరీక్షలు జరుపుతున్నారు. దీంతో విద్యార్థులకు ఒత్తిడి తగ్గి మంచి ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుంది.

– శివనాగేంద్ర, ప్రధానోపాధ్యాయుడు, యాళ్లూరు హైస్కూలు

విద్యార్థులకు ఒత్తిడి తగ్గింది



పదిలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నాం. ప్రస్తుతం పదో తరగతి విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గి పరీక్షలు బాగా రాసే అవకాశాలు ఉన్నాయి. పరీక్ష విధానంలో మార్పుచేసి సబ్జెక్టుకు సబ్జెక్టుకు మధ్య సెలవు రావడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– అబ్దుల్‌కరీం, ఎంఈఓ, గోస్పాడు

హాస్టల్ తనిఖీ

ఉయ్యాలవాడ: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం, ఎస్సీ బాలుర వసతి గృహాలను జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బోధనం బాలనాగన్న శనివారం తనిఖీ చేశారు. మౌలిక వసతుల గురించి విద్యార్థులను ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అంటూ అడిగి తెలుసుకున్నారు. బీసీ బాలుర వసతి గృహంలో 50 మంది విద్యార్థులకు గానూ 25 మంది మాత్రమే హాజరు కావడంపై ఆరా తీశారు. మధ్యాహ్నం 12 గంటల సమయం అయినప్పటికీ వంట ఏర్పాటు చేయకపోవడంతో వంట గదిలో ఉన్న పాత్రలను పరిశీలించగా ఉదయం చేసిన ఇడ్లీలను ఆయన పరిశీలించారు. మధ్యాహ్నం భోజనం బదులుగా ఈ ఇడ్లీలే మళ్లీ పెడతారా అని ఆరా తీయగా విద్యార్థులు తెల్ల ముఖం వేశారు. హాస్టల్ వార్డెన్ పనితీరుపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు బాలనాగన్న తెలిపారు.


బీసీ వసతి గృహంలో విద్యార్థులకు అందించే ఇడ్లీలను పరిశీలిస్తున్న ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు

విలువైన ప్రాణాలు కాపాడండి


ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ మల్లికార్జునగుప్తా

బొమ్మలసత్రం: రహదారులపై ప్రమాదాలు జరిగి కొన ఊపిరితో ఉన్న వారికి వైద్యం అందేలా చూసి విలువైన ప్రాణాలను కాపాడాలని ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా లారీ డ్రైవర్లను కోరారు. శనివారం స్థానిక విజయ డెయిరీ సమీపంలోని లారీ యూనియన్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కార్యక్రమానికి సీఐ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ భారీ వాహనాలకు యజమానులు తప్పనిసరిగా అన్ని ధృవ పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రహదారులపై వెళ్లే సమయంలో ప్రమాదాలు చేసి అక్కడి నుంచి వాహనంతో తప్పించుకుని వెళ్తే చట్ట ప్రకారం ఎదురయ్యే సమస్యలను వివరించారు. వాహనాలు నడిపేటప్పుడు నిద్ర మత్తురాకుండా స్టాప్ అండ్ వాష్ చేసుకుని ప్రయాణం మొదలుపెట్టాలన్నారు. దీని ద్వారా డ్రైవర్లకు, ఎదురుగా వచ్చే వాహనదారులకు ప్రాణాపాయం తప్పుతుందన్నారు. లారీ ఓనర్లు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కల్పనకు కృషి


మాట్లాడుతున్న డాక్టర్ గోరంట్ల జ్యానేష్

నంద్యాల(న్యూటౌన్): నిరుద్యోగ యువతీ, యువకుల స్వయం ఉపాధి కల్పనకు కృషిచేస్తామని కర్నూలు మేత్రాసన పీఠాధిపతి డాక్టర్ గోరంట్ల జ్యానేష్ తెలిపారు. శనివారం పట్టణంలోని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో డైరెక్టర్ ఫాదర్ రాజేంద్ర అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న జ్యానేష్ మాట్లాడుతూ యువత జీవన స్థితిగతులను తెలుసుకునేందుకు, యువతకు వృత్తి విద్యాకోర్సుల ద్వారా ఉపాధి కల్పనకు కృషి చేస్తామన్నారు. మేత్రాసనం ద్వారా నిర్వహిస్తున్న వృత్తి విద్యా కోర్సులను వివరించారు. కేడీఎస్ఎస్, డాన్‌బోస్కో, గృహిణి చైతన్య సెంటర్ల ద్వారా వివిధ విద్యాకోర్సులు నిర్వహిస్తున్నామని, జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నంద్యాల డీన్‌ఫాదర్ మద్రెడ్డి, ఫాదర్ ప్రసన్న పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యం

- శాంతి, సమాధానం, ప్రేమ, కరుణ చూపిన దయామయుడు జీసస్
- డోర్నకల్ బిషప్ కె.పద్మారావు


నూతన ఆలయాన్ని ప్రారంభిస్తున్న బిషప్ జార్జి కొర్నెలి


ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు


పాల్గొన్న మత గురువులు

నంద్యాల(న్యూటౌన్): దేవాలయాలు సమస్త జనులకు ప్రార్థనా మందిరాలు, క్రైస్తవులు ఐకమత్యంతో ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని, శాంతి, సమాధానం, ప్రేమ, కరుణ చూపిన జీసస్ అడుగు జాడల్లో ముందుకెళ్లినప్పుడే ఆలయాలు అభివృద్ధి చెందుతాయని అందుకు నిదర్శనం నంద్యాల హోలీక్రాస్ చర్చి అని డోర్నకల్ బిషప్ ది రైట్ రెవరెంట్ కె.పద్మారావు, చెన్నై డిప్యూటీ మాడరేటర్ కరీంనగర్ డయాసిస్ బిషప్ రూబెన్ మార్క్, రాయలసీమ డయాసిస్ బిషప్ ఐజక్ వరప్రసాద్, రిటైర్డు బిషప్ ఎగ్గోని పుష్పలలిత, నంద్యాల ఇన్‌చార్జి బిషప్ జార్జ్ కొర్నెలీ అన్నారు. శనివారం పట్టణంలోని హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి వెనుక భాగంలో నిర్మించిన హోలీక్రాస్ సెంటినరీ చర్చిని ఆరుగురు బిషప్‌లు ప్రారంభించారు. నంద్యాల డయాసిస్ పరిధిలోని అన్ని సంఘాల క్రైస్తవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమాన్ని హోలీక్రాస్ కెథడ్రల్ సెంటినరీ చర్చి డీనరీ చైర్మన్ కొత్తమాసి జోసెఫ్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా నూతన ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం శిలాఫలకం వద్ద ప్రత్యేక ప్రార్థన చేసి ఆలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పాల్గొన్నారు. అనంతరం భక్తులందరికీ ప్రేమ విందును ఏర్పాటు చేశారు. డయాసిస్ వైస్ ప్రెసిడెంట్ వరప్రసాద్, డీనరీ చైర్మన్లు నందం ఐజక్, సామేలు రత్నరాజ్, ప్రేమ్‌చంద్, సెక్రటరీ ప్రభుదాసు, ఎం.చిరంజీవి, డయాసిస్ సెక్రటరీ స్టాండ్లీ విలియం, సాల్మోన్ జోషి పాల్గొన్నారు.

ఘనంగా కోత పండుగ..

హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి 120వ వార్షికోత్సవ వేడుకలతో పాటు, కోత పండుగను ఘనంగా నిర్వహించారు. ముందుగా చర్చి చుట్టూ ప్రదక్షిణలు చేసి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. కార్యక్రమాన్ని డీనరీ చైర్మన్ కొత్తమాసి జోసెఫ్ అధ్యక్షతన నిర్వహించారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఈఓ, ఏఈఓ, పండితులు

మహానంది: మహానందిలో 24 నుంచి ఐదు రోజుల పాటు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అలంకార మండపంలో శనివారం బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ పెళ్లిపెద్ద నంద్యాల బ్రహ్మనందీశ్వరస్వామి వార్లను ఆహ్వానించేందుకు 22న మహానందీశ్వరుడి దంపతులు వెళ్లి, 23న తిరిగి వస్తారన్నారు. 24 నుంచి పూజలు ప్రారంభమవుతాయని, సాయంత్రం ధ్వజారోహణం పూజలు శాస్త్రోక్తంగా చేపడతారని తెలిపారు. ప్రతి రోజూ స్వామి, అమ్మవార్లకు ఉదయం, రాత్రి వాహనసేవలు, గ్రామోత్సవాలు ఉంటాయన్నారు. 26న మహాలింగోద్భవం సందర్భంగా (మహా శివరాత్రి) మహారుద్రాభిషేకం, మరుసటి రోజు(27న) తెల్లవారుజామున మహానందీశ్వర కల్యాణం, రాత్రి పుష్పపల్లకీ సేవ, 28న మహారథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ ఎరమల మధు, సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఏఈ శ్రీనివాసయాదవ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం శ్రీనివాసులు(చిన్నా) పాల్గొన్నారు.

మహానందీశుడి దంపతులకు కల్యాణం

మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు మాఘమాసం, శనివారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, శాంతారాంభట్‌లు స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్త పూజలు చేశారు. పలు ప్రాంతాల భక్తులు కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించి స్వామి, అమ్మవారి అనుగ్రహం పొందారు.

10 మంది విద్యార్థినులకు అస్వస్థత

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలోని ఏపీ మోడల్ స్కూల్ హాస్టల్‌లో ఈ నెల 2వ తేదీ (ఆదివారం) చికెన్ తిని 10 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మోడల్ స్కూల్ హాస్టల్‌లో ఉండే విద్యార్థినులకు ఆదివారం మెనూలో చికెన్ ఉండడంతో నాణ్యత లేని చికెన్ తీసుకొచ్చారు. వండే సమయంలో ఉడకకపోవడంతో తిన్న 10 మంది విద్యార్థినులకు వాంతులు, కడుపునొప్పితో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మరుసటి ఉదయం అధికం కావడంతో వార్డెన్ బయటకి తెలియకుండా స్థానిక ఆర్ఎంపీల వద్ద చికిత్స చేయించింది. ఎంతకు తగ్గకపోవడంతో విద్యార్థినుల తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నట్లు తెలిసింది. ఇప్పటికీ ఇద్దరు విద్యార్థినులు ఆసుపత్రిలో ఉన్నట్లు సమాచారం. దీంతో హాస్టల్ నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థినులు చాలా మంది ఇంటికి వెళ్లిపోయారు. ఉన్నతాధికారులు విచారణ చేసి పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

పుచ్చకాయలొచ్చేశాయ్..


అమ్మకానికి ఉంచిన పుచ్చకాయలు

నంద్యాల(అర్బన్): వేసవి తాపం అప్పుడే ప్రారంభమైంది. వారం క్రితం వరకు గిలిగింతలు పెట్టిన చలి నెమ్మదిగా కనుమరుగవుతోంది. ఇప్పటికే చలి ప్రభావం తగ్గింది. రథసప్తమి వెళ్లడంతో భానుడు ప్రభావం చూపడం ఆరంభించాడు. దీంతో ఉష్ణతాపం నుంచి ఉపశమనాన్నిచ్చే ఫలాలు కూడా అందుబాటులోకి వచ్చేశాయి. వేసవి ఫలాల్లో ఒక టైన కలింగర (వాటర్ మిలన్) విక్రయాలు పట్టణంలోని పలు చోట్ల ప్రారంభమయ్యాయి. శ్రీనివాసనగర్, ఎన్‌కే రోడ్డు, సాయిబాబానగర్, టెక్కె, గాంధీ చౌక్, ఆర్టీసీ బస్టాండ్, బొమ్మలసత్రం తదితర ప్రాంతాల్లో వ్యాపారులు పుచ్చకాయలను ప్రత్యేక డేరాలు వేసి విక్రయిస్తున్నారు. ప్రారంభ సమయం కావడంతో కిలో రూ.30 నుంచి 40 వరకు విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పండు సైజును బట్టి రూ.100 నుంచి రూ.200 వరకు అమ్మకాలు సాగుతున్నాయి. మరికొన్ని చోట్ల ముక్కలుగా కోసి ఒక్కో ముక్క రూ.15 చొప్పున విక్రయిస్తున్నారు. నియోజకవర్గంలో కలింగర సాగు లేకపోవడంతో ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం, చాగలమర్రి, కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి స్థానిక వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. మరో నెల గడిస్తే మార్కెట్‌లోకి దిగుబడి విస్తృతంగా వస్తుందని, అప్పుడు కాస్త ధరలు తగ్గే అవకాశముందని విక్రయదారులు పేర్కొంటున్నారు.

ఊపిరి పోసిన మొక్కజొన్న

- కలిసొచ్చిన దిగుబడులు, ధరలు
- గట్టెక్కిన రైతన్నలు


ఆలమూరు సమీపంలోని ఈద్గా బయలు ప్రదేశంలో ఆరబోసిన మొక్కజొన్నలు

రుద్రవరం: మొక్క జొన్న పంట రైతులకు ఊపిరి పోసింది. ఆశాజనకంగా దిగుబడులు రావడం.. ధరలు కూడా బాగానే ఉండటంతో ఈ సారి అన్నదాతలకు కాస్త ఊరట లభించింది. ఖరీఫ్, రబీ సీజన్లలో వివిధ రకాల పంటలు సాగు చేసిన పంటలు సరైన దిగుబడులు రాలేదు. గిట్టుబాటు ధరలు కూడా లేకపోవడంతో నష్టాల పాలయ్యారు. అలాంటి సమయంలో మొక్క జొన్న పంట మాత్రమే ఖరీఫ్, రబీ సీజన్లలో ఆశాజనకంగా దిగుబడులు రావడం, గిట్టుబాటు ధరలు ఉండటం రైతులకు ఈ ఏటి మేటి పంటగా నిలిచింది.

ఎకరాకు 35 క్వింటాళ్లు..

మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని రైతులు ఖరీఫ్, రబీ సీజన్ల కింద దాదాపు 5 వేల హెక్టార్లలో మొక్క జొన్న పంట సాగు చేశారు. వాతావరణం అనుకూలించి ఎకరాకు 30 నుంచి 35 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చాయి. వాటికి తగ్గట్టుగానే ధర కూడా క్వింటా రూ.2,400 వరకు లభించాయి. దీంతో పెట్టుబడులు పోనూ కాస్తో కూస్తో లాభాలు ఆర్జించారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం మండలంలో రబీ సీజన్ కింద రెండో పంటగా సాగు చేసిన మొక్క జొన్న పంట కాలం పూర్తి అయ్యి కోతలు మొదలయ్యాయి. వచ్చిన దిగుబడులను ఆర్‌అండ్‌బీ రోడ్లు, బయలు ప్రదేశాల్లో ఆరబోశారు. ఎకరాకు 35 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నాయి. వాటిని ప్రస్తుతం క్వింటా రూ.2,350 ప్రకారం విక్రయించుకుంటున్నారు.మొక్క జొన్న మినహా మిగిలిన మినుము, జొన్న, వరి, పత్తి, పొగాకు వంటి పంటలన్నీ వాతావరణం అనుకూలించక దిగుబడులు తగ్గడం, ధరలు లేకపోవడంతో రైతులు నష్టాలు చవిచూశారు. మినుము పంటకు వైరస్ సోకి ఎకరాకు రెండు క్వింటాళ్లకే దిగుబడులు పడిపోయాయి. జొన్న పరిస్థితి చూస్తే దిగుబడులు ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్లకే పడిపోయింది. ఇలా వివిధ రకాల పంటలన్నీ రైతులకు కలిసి రాలేదు. మొక్క జొన్న పంట మాత్రమే ఖరీఫ్, రబీ సీజన్లలో ఆశాజనకంగా దిగుడులు వచ్చి ధర మంచిగా అంది రైతులకు ఊరటనిచ్చాయి.

నడిరోడ్డుపై ఊడిపడిన టైరు


రోడ్డుపై పడిన టైరు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజు పల్లె గ్రామం వద్ద ఓ ట్యాంకర్ స్టెప్నీ టైర్ ఊడిపోయింది. దీంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. శనివారం నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న ఓ ట్యాంకర్‌కు చెందిన స్టెప్నీ టైర్ ఊడిపోయింది. ట్యాంకర్ వెనుక వస్తున్న లారీ టైర్‌ను ఢీకొని ఆగింది. దీంతో లారీ, ట్యాంకర్ డ్రైవర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో కాసేపు ట్రాఫిక్ జామ్ అయ్యింది. సమాచారం అందుతున్న హైవే పోలీసులు సంఘటనా స్థానికి చేరుకుని వారికి సర్దిచెప్పి ట్రాఫిక్ క్లియర్ చేశారు.